సెల్‌ఫోనే సర్వస్వం

దూర మైపోతున్న బంధాలు, బంధుత్వాలు

ఆట, పాటలు మరిచిన చిన్నారులు

మారిపోయిన లైఫ్‌స్టైల్

రోజువారీ కార్యకలాపాలకూ సెల్‌ఫోనే ఆధారం



జగదాంబ: ఈ డిజిటల్ యుగంలో మనుషుల జీవితాలు సెలమయం అయిపోయాయి. సెల్‌ఫోన్ లేనిదే రోజు గడిచేలా లేదు. అన్నింటికీ ఆధారం సెల్‌ఫోనే అయిపోయింది. గతంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో మాటామంతీ ఉండేది. కుశల ప్రశ్నలు, యోగక్షేమాల ఘట్టం దినచర్యలో భాగమయ్యేది. దూరంగా ఉన్న వారికి ఉత్తరాలు రాసి.. తిరుగు టపా వస్తే సంతోషంగా ఆ కబుర్లు అందరికీ కలబోసుకునే సంస్కృతి నడిచేది. సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత అన్నీ అదే అయింది. పెద్ద పెద్ద కంపెనీల సీఈవోల దగ్గర నుంచి దినసరి కూలీల వరకు అందరూ ఇప్పుడు సెల్‌ఫోన్ లేనిదే ఉండలేకపోతున్నారు.



సెల్ ఫోన్లతో విద్యార్థినులు

బాల్యానికి చెక్..

సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత చిన్న పిల్లలు కూడా దానికి బాగా అలవాటు పడిపోయారు. బయట ఆడుకోవడం మానేసి ఓ మూల కూర్చుని సెల్‌లో గేమ్స్ ఆడుతున్నారు. దీనివల్ల పిల్లల్లో చురుకుదనం తగ్గి చదువులో వెనుకబడుతున్నారు. దృఢత్వం లేక శారీరకంగా నీరసంగా ఉంటున్నారు.

పుస్తకాలు, దినపత్రికల పఠనమూ సెల్‌ఫోన్‌లోనే..

వెనుకటి కాలంలో అందరికీ పుస్తకాలు, పత్రికలే చక్కటి కాలక్షేపాలు. ఆ రోజుల్లో దాదాపు అందరి చేతుల్లోనూ పుస్తకాలు ఉండేవి. ప్రజల పఠనాసక్తి వల్ల గ్రంథాలయాలు కళకళలాడేవి. కానీ సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత అంతా వాటిలోనే కానిచ్చేస్తున్నారు.



ముగ్గురు ఒకే దగ్గర ఉన్నా, ఎవరి ప్రపంచం వారిదే

రేడియో.. ఉత్తరం కనుమరుగు..

ఒకప్పుడు కాలక్షేపానికి రేడియోను మించింది లేదు. రేడియో ఒక దర్జా కూడా. అలాగే కార్డు, ఇన్‌ల్యాండ్ లెటర్ల వినియోగం కూడా విరివిగా జరిగేది. కానీ సెల్‌ఫోన్ వచ్చాక అవి రెండూ కనుమరుగు అయిపోయాయి.



పూర్తిగా కనుమరుగైన తోకలేని పిట్ట (ఉత్తరం)



కానరాని రేడియో, టేపురికార్డర్, గడియారం

కెమెరా, గడియారానిదీ అదే దారి..

గతంలో చాలా మంది ఇళ్లలో ఏ వేడుక జరుపుకున్నా ఆ జ్ఞాపకాలను కెమెరాలో బంధించేవారు. స్టూడియోలకు వెళ్లి ఆ ఫొటోలు కడిగించుకుని వాటిని భద్రంగా దాచుకునేవారు. ఇప్పుడు సెల్‌ఫోన్‌లోనే ఫొటోలు తీసి తెలిసిన వారికి పంపుతున్నారు. ఫొటోల సరదాయే లేదు. అలాగే కాలగణన కోసం ఉపయోగించే గడియారం కూడా సెల్‌ఫోన్ వల్ల కనుమరుగు అయిపోయింది.

ఇంకా మరెన్నో..

ఇలా చెప్పుకుంటూ పోతే సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత మనిషి జీవితంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. ఎన్నో వస్తువులు తమ ఉనికి కోల్పోయాయి. టార్చిలైట్, క్యాలిక్యులేటర్ కనిపించడంలేదు. టీవీ, ఆట, పాట లేవు. పరిచయస్తులతో మాటల్లేవు. మొక్కుబడి సంభాషణతోనే ముగిస్తున్నారు. ఇలా మనిషి జీవితంలో సెల్‌ఫోన్ అతి ముఖ్యంగా మారి జీవన సరళిని పూర్తిగా మార్చేసింది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



మాట్లాడుతున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణ

అల్లిపురం: నగరపాలక సంస్థ పరిధిలో వీధి విక్రయదారులు, ఆహార సరఫరాదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ప్రధాన కార్యక్రమంలో ఆయన వీధి వ్యాపారులు, ఫంక్షన్ హాల్ నిర్వాహకులు, క్యాటరింగ్ నిర్వాహకులు, దుకాణదారులుతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. జనవరి 1 నుంచి 120 మైక్రాన్ల లోపు మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు నిషేధించడమైందన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి దుకాణం ముందు సే నో ప్లాస్టిక్ బోర్డు ప్రదర్శించాలన్నారు. బయో డిగ్రేడబుల్ కవర్లు వినియోగించాలన్నారు. వినియోగదారులు తప్పనిసరిగా గుడ్డ, నార సంచులు వాడాలన్నారు. జీవీఎంసీ సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వీధి వ్యాపారులు, దుకాణాల యజమానులు తదితరులు

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన వీఎంఆర్‌డీఏ చైర్మన్



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసిన వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా బొకేలకు అయ్యే ఖర్చుతో నిరుపేద విద్యార్థులకు అవసరమయ్యే నోట్ బుక్స్ అందజేయాలని కలెక్టర్ చెప్పడం మంచి పరిణామని చైర్మన్ అన్నారు. అనంతరం ఇద్దరు పలు విషయాలపై చర్చించారు.

రెవెన్యూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

మహారాణిపేట: విశాఖపట్నం జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, రెవెన్యూ అధికారి భవానీశంకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేష్, నగర అధ్యక్షుడు యోగి, కార్యదర్శి రవిశంకర్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నవీన్ రాజ, రవి కృష్ణ, మహిళా నాయకులు విజయ కుమారి, శైలజ ఇతర నాయకులు పల్లా మహేష్, రవికృష్ణ, రామకృష్ణ, లక్ష్మణ్, రాజు, సిద్ధార్థ, సురేష్, చంద్రశేఖర్, వరుణ్, వరలక్ష్మి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగికి ఆశ్రయం



మానసిక దివ్యాంగురాలితో మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఒక మహిళకు జీవీఎంసీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించారు. ఆరిలోవ పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఏయూటీడీ సిబ్బంది గురువారం ఆరిలోవ వెళ్లి ఆమెను కలిశారు. ఆమె పేరు సంధ్య (45). ఆమె ఆరిలోవలో ఒకరి ఇంట్లో ప్రవేశించి బాత్రూమ్‌లో స్నానం చేస్తుండటంతో, వాళ్లు భయపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి సహకారంతో ఏయూటీడీ సిబ్బంది ఆమెను ద్వారకానగర్‌లోని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ ఏయూటీడీ మహిళా షెల్టర్ హోంకి తరలించారు. సంధ్య మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వెంటనే చికిత్స ప్రారంభించారు. మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్ ప్రశాంత్ ఈ రెస్క్యూలో పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా 108 సేవలు



వాహనాలను తనిఖీ చేస్తున్న 108 స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మురుగన్

మహారాణిపేట: 108 వాహన సేవల్ని మరింత మెరుగు పరిచేందుకు వీలుగా ప్రభుత్వానికి నివేదిస్తామని ఆ విభాగం స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మురుగన్ బృందం హామీ ఇచ్చింది. గురువారం విశాఖలోని పలు ప్రాంతాల్లోని 108 వాహనాల పని తీరుపై ఆకస్మిక తనిఖీలు జరిపారు. ప్రభుత్వం తరఫున నగరానికి విచ్చేసిన మురుగన్‌బృందం స్టేట్ నోడల్ అధికారి హోదాలో పలు కీలక అంశాలపై చర్చించింది. క్షతగాత్రుల్ని ఆదుకునేందుకు అహర్నిశలు ప్రయత్నిస్తామని, సేవలు మరింత మెరుగ్గా ఉంటాయని స్పష్టం చేసింది. విశాఖ జిల్లా 108 విభాగం మేనేజర్ వీవీ త్రినాథరావు, సిటీ 108 విభాగం కో ఆర్డినేటర్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లికి శుభాకాంక్షలు



వాసుపల్లిని గజమాలతో సత్కరిస్తున్న 29వ వార్డు పార్టీ నాయకులు

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు 29వ వార్డు నాయకుడు పీతల వాసు, సౌత్ సోషల్ మీడియా యాక్టివిస్ట్ బెవర మహేష్, పార్టీ సీనియర్ నాయకుడు బొండాడ వెంకట్రావు, నాయకులు కొండ్రు సతీష్, ఉరికిటి శివ వండు, గొర్రిపాటి శివ, గొలగాని మధు, ముగడ రాజేష్, పీతల మహేష్, సింగంపల్లి తాతారావు, కొండ్రు అప్పారావు, రాజు, గండివలస పెంటయ్య తదితరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వాసుపల్లికి తోట శుభాకాంక్షలు..

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వార్డు నాయకుడు, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండా రమణ, సూరిబాబు, అనిల్, లక్ష్మణరావు (వైట్), పార్టీ కార్యకర్తలు గురువారం ఆశీలమెట్ట దరి వాసుపల్లి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.



వాసుపల్లికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న తోట పద్మావతి తదితరులు



వాసుపల్లికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న 35వ వార్డు నాయకుడు అలపన కనకరెడ్డి

వాసుపల్లికి అలపన శుభాకాంక్షలు..

జగదాంబ: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు జీవీఎంసీ 35వ వార్డు పార్టీ నాయకుడు అలపన కనకరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో వాసపల్లికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్, పెదమూర్తి, సంతోష్‌కుమార్ రెడ్డి, రమణమ్మ, పుష్ప, సూర్యనారాయణ, రాము పాల్గొన్నారు.


ఆలోచింపజేసిన కళా జాత




కళా జాత ప్రదర్శిస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారులు

సీతమ్మధార: కార్మికులు, కష్టజీవుల కోసం హష్మీ అనేక వీధి నాటికలు, కళారూపాలు ప్రదర్శించి ప్రజా చైతన్యానికి ఎంతో కృషి చేశారని వక్తలు కొనియాడారు. ప్రజా నాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రజా కళాకారుడు హష్మి 36వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్, ప్రజా నాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్షుడు దండు నాగేశ్వరరావు మాట్లాడారు. అధిక ధరలు, కరెంటు చార్జీల భారానికి వ్యతిరేకంగా నాటికలు ప్రదర్శించారు. ప్లాస్టిక్ ఎంత ప్రమాదకరమో తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ, ఆహార భద్రత వంటి నాటికలు ప్రేక్షకులను ఎంతగానో ఆలోచింపజేశాయి, విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి గాయకులు ఆలపించిన గేయాలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి శాఖ జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్షులు జి. స్టాలిన్, సహాయ కార్యదర్శి అన్యాయం మౌలాలి, ఎన్వీ రమణ, డేవిడ్ రాజు, శివ జ్యోతి, పుష్యమి, బాలు చైతన్య, వెంకటరమణ, ఇమంది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షణ యాత్రికుల జూబ్లీ వేడుకలు



సందేశం ఇస్తున్న బిషప్ జయరావు, ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్



జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

కంచరపాలెం: జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం సెయింట్ పీటర్స్ ఆవరణలో గురువారం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ ఆధ్వర్యంలో చారిత్రాత్మక నిరీక్షణ యాత్రికుల జూబ్లీ వేడుకలను విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ పాలిమేర జయరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువుని యెడల నిరీక్షణ కలిగిన భక్తుల ప్రార్థనలు సేవ- ప్రపంచ శాంతిని నెలకొల్పుతాయన్నారు. యుద్ధాలను నివారించగల గొప్ప నిరీక్షణ యాత్రికులుగా అందరం రూపొందాలని పిలుపునిచ్చారు. ముందుగా విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ పాలిమేర జయరావు, రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ జూబ్లీ రెప్లికాను ఆవిష్కరించారు. సుమారు 150 మంది ఫాదర్లు, నగరవ్యాప్తంగా వందల సంఖ్యలో కథోలికులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరిశుద్ధ జలంతో ప్రజలను ఆశీర్వదించారు.

గంజాయి కలిగి ఉన్న ఐదుగురి అరెస్ట్

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న ఐదుగురు యువకులను టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 9 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం లాడ్జిల తనిఖీల్లో భాగంగా చావులమదుం దరి సంపత్ రెసిడెన్సీ లాడ్జిలో మహారాష్ట్ర, తమిళనాడుకు చెందిన ఐదుగురు యువకులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద గల లగేజీని తనిఖీ చేయగా తొమ్మిది కేజీల గంజాయి కనుగొన్నారు. దీంతో బెంగళూరుకు చెందిన గిరీష్, అరుణ్, బాలాజీ, తమిళనాడుకు చెందిన అరుణ్ గుణశేఖర్, బాలకృష్ణన్ మనోజ్‌లను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రేపు సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, మహ్మద్ ఖాన్ తదితరులు

దాబాగార్డెన్స్: గీత్ సంగీత్ సినీ సంగీత సాంస్కృతిక సంస్థ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 4న శశివదనే.. శశివదనే శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న ఈ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ గురువారం సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు చేతుల మీదుగా ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు, మాజీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ మహ్మద్ ఖాన్ మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతం చేయాలని కళాకారులు, సంగీత ప్రియులు, కళాభిమానులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గాయకులు, న్యాయవాది ఎస్ఎస్ఎన్ రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాంధ్రప్రదేశ్‌ను మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

• మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: జగనన్న హయాంలోని విద్యాంధ్రప్రదేశ్‌ని నేడు కూటమి ప్రభుత్వం మద్యాంధ్రప్రదేశ్‌గా తయారు చేసిందని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆరోపించారు. అశోక్‌నగర్‌లో గల తన కార్యాలయంలో గురువారం ఆంగ్ల నూతన సంవత్సర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మేనిఫెస్టోను టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగిస్తే.. నేడు మేనిఫెస్టోను చంద్రబాబు తన మెమరీ నుంచి తొలగించారని దుయ్యబట్టారు. అబద్ధాలాడి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్‌ను గాలికి వదిలేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో కన్నా 80 శాతం మద్యం, 40 శాతం బీర్ల విక్రయాలు జరిగాయన్నారు. ఈ నూతన సంవత్సరం సందర్భంగా ఇప్పటికైనా నా కూటమి ప్రభుత్వం బుద్ధి మార్చుకుని ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా నాడు జగనన్న పథకాలతో పాటు ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్‌ను కూడా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, మాజీ కార్పొరేటర్ అమ్మాజీ, పలు వార్డుల నాయకులు పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, దొడ్డి బాపూ ఆనంద్, అలపన కనకారెడ్డి, భీశెట్టి ప్రసాద్, మైనార్టీ నాయకుడు ముజీబ్‌ఖాన్, లండా రమణ, వద్దాది దిలీప్, నాగమణి, నీలాపు లక్ష్మి, వాసరాల సుబ్రహ్మణ్యం, రాజాపాత్రుడు, తాడి రవితేజ, సూరాడ అప్పారావు, కోన శంకర్, కోన ప్రకాష్, వాసుపల్లి రాజ్‌కుమార్, బెవర మహేష్, బొండాడ వెంకట్రావు, శివ, వాసుపల్లి బంగారమ్మ, చేపల రాజు, సూరిబాబు, రామరాజు, సాగర్, గురజాపు రవి, రాము, జగన్, రమణమ్మ, సుధారెడ్డి, పోలవరపు ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ శ్రేణుల నడుమ కేక్ కట్ చేస్తున్న వాసుపల్లి

ఏబీ బర్ధన్‌కు ఘన నివాళి

అల్లిపురం: నీతి, నిజాయితీలకు నిలువెత్తు నిదర్శనం ఏబీ బర్ధన్ అని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కొనియాడారు. అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం బర్ధన్ 9వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఏబీ బర్ధన్ స్వతంత్ర పోరాటం తొలి నాళ్లలోనే ఉద్యమంలో ప్రవేశించి అంచెలంచెలుగా ఎదిగారన్నారు. కార్మిక సంఘాల నిర్మాణం ద్వారా అఖిల భారత విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా, నాలుగు దశాబ్దాలకు పైగా అఖిల భారత రక్షణ రంగం ఉద్యోగుల ఫెడరేషన్ నిర్మాణంలో కీలక భూమిక పోషించారన్నారు. మరణించే వరకు పార్టీ ఉపాధ్యక్షులుగా పని చేశారన్నారు. ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా దశాబ్ద కాలం పని చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అత్యుతరావు, సీపీఐ ఏఐటీయూసీ నాయకులు కె. సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు, ఎం.మన్మథరావు, పి.చంద్రశేఖర్, జి.కాసులరెడ్డి, ఎస్.సూరిబాబు, ఎన్.నాగభూషణం, వై.రాంబాబు, కె.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.



బర్ధన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

ఒక్క రోజులోనే సెల్‌ఫోన్ రికవరీ

దాబాగార్డెన్స్: ప్రయాణంలో చేజారిన సెల్‌ఫోన్‌ను వన్‌టౌన్ పోలీసులు రికవరీ చేశారు. ఫోన్ పోగొట్టుకున్న ఒక్క రోజులోనే బాధితుడికి తిరిగి ఫోన్ అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. చిలకపేటకు చెందిన సీహెచ్ కాశీబాబు తన భార్యను వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి (ఘోషాసుపత్రి)కి తీసుకెళ్లేందుకు ఈ నెల 1 ఉదయం 11 గంటల ప్రాంతంలో పోలీస్ బ్యారెక్స్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రికి వెళ్లే దారిలో తన భార్య ఫోన్ (రియల్‌మి ఎన్ 55) చేజారింది. దారి పొడవునా వెతికినా దొరక్కపోవడంతో సమీపంలో గల కమిషనరేట్‌కి వెళ్లి పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సీపీ స్పందించి వెంటనే వన్‌టౌన్ పోలీసులకు తెలిపారు. వన్‌టౌన్ క్రైం పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. ఫోన్ వెతికే ప్రయత్నం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో అది పెందుర్తిలో సిగ్నల్ చూపించడంతో క్రైం ఎస్సై స్టేషన్ ఏఎస్ఐని పంపించి పట్టుకున్నారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న కాశీబాబుకు రికవరీ చేసిన ఫోన్‌ను అందజేశారు.



ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి మొబైల్ అందజేస్తున్న వన్‌టౌన్ క్రైం ఎస్సై

ధ్రువపత్రాల జారీలో జాప్యం వద్దు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న స్థానిక యువకుడు

మహారాణిపేట: ధ్రువపత్రాలు జాప్యం లేకుండా జారీ చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. గురువారం సీతారామస్వామి దేవాలయం సమీపంలో మత్స్యకార భవన్‌లో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. మొత్తం 45 వినతులు స్వీకరించారు. 35 కుల ధ్రువీకరణ, పది ఆదాయ ధ్రువీకరణ పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తనతో మేలుకొలుపులు



బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి పాదాల చెంత నగర సంకీర్తన ప్రారంభిస్తున్న భక్తులు

అల్లిపురం: ధనుర్మాసం సందర్భంగా అల్లిపురంలోని వేంకటేశ్వరమెట్ట, శ్రీ అన్నమయ్య సంకీర్తనా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి రోజు నగర సంకీర్తనతో మేలుకొలుపులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి పాదాల వద్ద నుంచి సంకీర్తనలతో మహిళా భక్తులు అన్నమయ్య సంకీర్తనలు పాడుతూ, భజనలతో సింహాలదేవిడి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, అమ్మవారివీధి, కుమ్మరవీధి, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డు, ఎంజీఎం హైస్కూల్, ఘంటసాల మార్గం, గోవింద్‌రోడ్డు, కెప్టెన్ రామారావు జంక్షన్ మీదుగా తిరిగి బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకుంటున్నారు.